

# మనం హైదరాబాద్

రంగారెడ్డి | మేడ్చల్

గురువారం | 11 | జూన్ | 2026 పేజీలు: 9


## తెలంగాణలో ఇక నో ఫ్రెండ్లీ పోలీసింగ్



### డీజీపీ సీవీ ఆనంద్

కుషాయిగూడ, జూన్ 10 ( మనం న్యూస్): తెలంగాణలో ఇకపై స్నేహపూర్వక పోలీసు వ్యవస్థకు స్వస్తి పలుకుతున్నామని, ప్రజలను గౌరవిస్తామని, కానీ రౌడీలు, గుండాలను మాత్రం సహించబోమని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణలో మావోయిజం అంతమైందని, గ్రేహౌండ్స్ విభాగాన్ని తీసివేస్తున్నామని, 1700 మందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని, సైబర్ క్రైమ్ తమకు పెద్ద సవాల్గా మారిందని ఆయన పేర్కొన్నారు. .

# పారిశుద్ధ్యం-పచ్చదనానికి ఎంఎంసి ప్రాధాన్యం

**దోమల నివారణ, వర్షాకాల సన్నద్ధతపై కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి సమీక్ష**



పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపు, దోమల నివారణ చర్యలకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. బుధవారం నాగోల్ పరిధిలోని ఫతుల్లాగూడ ప్రాంతంలో ఆయన అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పరిస్థితులు, అర్బన్ బయోడైవర్సిటీ కార్యక్రమాలు, దోమల నియంత్రణ చర్యలు, వర్షాకాల సన్నద్ధత పనులను పరిశీలించారు. ఇందు అరణ్య నుంచి గోల్డెన్ లీవ్స్ విల్లాస్ వరకు పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించిన కమిషనర్ పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.

2



2

## ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దు

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



## దివ్యాంగుల హక్కుల చట్టం అమలుకు పార్లమెంట్లో గళం వినిపిస్తా

3

ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి



## 'వయసు జస్ట్ నంబర్ మాత్రమే'

2

**పిల్లలతో కేక్ కట్ చేసిన బాలయ్య**

**క్యాన్సర్ ఆసుపత్రిలో చిన్నారులతో బాలయ్య పుట్టిన రోజు వేడుకలు**



# ‘వయసు జస్ట్ నంబర్ మాత్రమే’

## పిల్లలతో కేక్ కట్ చేసిన బాలయ్య క్యాన్సర్ ఆసుపత్రిలో చిన్నారులతో బాలయ్య పుట్టిన రోజు వేడుకలు







హైదరాబాద్,జూన్10(మనం న్యూస్)ః నందమూరి బాలకృష్ణ (బాలయ్య) తన పుట్టినరోజు వేడుకలను హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్లో చిన్నారుల మధ్య అత్యంత ఘనంగా జరుపుకున్నారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి, వారికి బహుమతులు అందజేసి ఆనందంగా గడిపారు. ప్రతి ఏడాదీ తన పుట్టినరోజును క్యాన్సర్ రోగులైన చిన్నారుల మధ్య జరుపుకోవడం బాలకృష్ణకు ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఆయన ఆసుపత్రిలోని పిల్లలతో కేక్ కట్ చేసి, వారితో కాసేపు సరదాగా మాట్లాడారు.ఆసుపత్రి ప్రస్థానం: ఇదే సమయంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ 25 సంవత్సరాల (రజతోత్సవ) వేడుకలు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. 40 పడకలతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి, నేడు 715 పడకలతో దేశంలోనే అగ్రగామి క్యాన్సర్ ఆసుపత్రుల్లో ఒకటిగా ఎదిగిందని తెలిపారు. ఇదే సమయంలో ఆసుపత్రి ప్రారంభమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్కడ చికిత్స పొందుతున్న చిన్నారుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి, వారికి బహుమతులు అందజేశారు. 1989లో తన తండ్రి ఎన్టీఆర్ నాటిన ఈ మొక్క, నేడు 715 పడకలతో దేశంలోనే టాప్ 5 క్యాన్సర్ ఆసుపత్రులలో ఒకటిగా ఎదగడం వెనుక ఎంతోమంది కృషి ఉందని కొనియాడారు.. వారి శ్రమ ఫలితమే ఈరోజు మన భారతదేశంలోనే అగ్రామిగా ఆసుపత్రి స్థానం సంపాదించుకుంది. అందరికీ నా కృతజ్ఞతలతో పాటుగా అభినందనలు తెలియజేస్తున్నాను'' అని అన్నారు. తన దృష్టిలో వయసు అనేది కేవలం నంబర్ మాత్రమేనన్నారు.



### త్రివేణి విద్యార్థుల నగదు వితరణ

బాలకృష్ణ జన్మదినం సందర్భంగా త్రివేణి పాఠశాలల విద్యార్థులు సేకరించిన సహాయ నిధి నుంచి 1,01,116 రూపాయల నిధిని డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి బసవతారకం హాస్పిటల్ చైర్మన్, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ అందించి, శాలువాతో సత్కరించారు.త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, బసవతారకం హాస్పిటల్స్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా కలిసి పిల్లలు సేకరించిన నిధి నుంచి 1,01,116 రూపాయలు అందజేశారు. త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ త్రివేణి సంస్థలు మానవత్వం మనిషితత్వం అనే నినాదంతో అనేక ఛారిటీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి అని తెలియజేశారు.

# పారిశుద్ధ్యం-పచ్చదనానికి ఎంఎంసి ప్రాధాన్యం

## దోమల నివారణ, వర్షాకాల సన్నద్ధతపై కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి సమీక్ష..





సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపు, దోమల నివారణ చర్యలకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. బుధవారం నాగోల్ పరిధిలోని ఫతుల్లాగూడ ప్రాంతంలో ఆయన అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పరిస్థితులు, అర్బన్ బయోడైవర్సిటీ కార్యక్రమాలు, దోమల నియంత్రణ చర్యలు, వర్షాకాల సన్నద్ధత పనులను పరిశీలించారు. ఇందు అరణ్య నుంచి గోల్డెన్ లీవ్స్ విల్లాస్ వరకు పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించిన కమిషనర్ పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఫుట్ పాత్ల వెంట మొక్కలు నాటి పచ్చదనాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని యూబీడీ మేనేజర్కు సూచించారు. అనంతరం ఫతుల్లాగూడ చెరువును పరిశీలించిన ఆయన చెరువులో దోమల లార్వా పెరుగుదల కనిపించలేదని పేర్కొన్నారు. అయితే చెరువు సమీపంలోని బాక్స్ డ్రెయిన్లలో లార్వా ఉన్నట్లు గుర్తించి వెంటనే యాంటీ లార్వల్ ఆపరేషన్లు చేపట్టి దోమల ఉత్పత్తిని పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా ఆదర్శ్ నగర్, అగర్వాల్ గ్రానైట్, జైపురి కాలనీ ఎక్స్ రోడ్, శ్రావణ శ్రీ ఎన్క్లేవ్, ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిసరాలు, అగమయ్య కాలనీ, గణేష్ నగర్, పుల్లారెడ్డి స్వీట్స్ సమీపం, పెద్ద అంబర్పేట్ చెక్పోస్ట్, భూదాన్ కాలనీ, కళానగర్, హనుమాన్ నగర్ తదితర ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలను పరిశీలించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని, నీటి నిల్వల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణతో పాటు పచ్చదనం పెంపు, దోమల నియంత్రణ, వర్షాకాల సన్నద్ధత అంశాల్లో అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దు

## జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి): ధాన్యం కొనుగోలు లో జాప్యం చేయవద్దని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి కొల్తూర్లోని వెంకటరమణ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసారు.

ఈ సందర్భంగా మిల్లులో కొనసాగుతున్న ధాన్యం దిగుమతి, అన్లోడింగ్ నిల్వ ప్రక్రియలను క్షుణ్ణంగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. పరిశీలనలో భాగంగా మిల్లర్లతో సమావేశమై, ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దని, కేంద్రాల నుండి వచ్చిన వాహనాలను ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన అన్లోడ్ చేయాలని ఆదేశించారు. వాహనాలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి అవసరమైన మేరకు హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా, మిల్లర్ అక్నాలెడ్జ్మెంట్లను పెండింగ్లో ఉంచకుండా వెంటనే జారీ చేయాల, ధాన్యం దిగుమతి ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వాహనాల నిల్వ, అన్లోడింగ్ మరియు రసీదు జారీ ప్రక్రియలను సమన్వయంతో



నిర్వహించాలని ఆదేశించారు.మిల్లులో ధాన్యం నిల్వ పరిస్థితులు, హమాలీల అందుబాటు మరియు వాహనాల కదలికలను అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని మిల్లర్లకు స్పష్టం చేసారు.

అనంతరం అదనపు కలెక్టర్ బొమ్మరాశిపేట లోని గోడౌన్ను పరిశీలించారు. గోడౌన్కు ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, కొనుగోలు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన అదనపు గోడౌన్లను వెంటనే గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# మల్కాజిగిరిలో అనుమానంతో భార్య హత్య

**తుపాకీతో కాల్చి చంపిన రియల్ ఎస్టేట్ వ్యాపారి.. మాట్లాడుకుందామని పిలిచి కాల్పులు..**




మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి ): హైదరాబాద్లోని మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మారుతీనగర్కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అరుణ్కుమార్ తన రెండో భార్య నిషారాణిని తుపాకీతో కాల్చి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా దంపతుల మధ్య విభేదాలు కొనసాగుతుండగా, భార్యపై అనుమానాలు పెంచుకున్న అరుణ్కుమార్ మాట్లాడుకుందామని చెప్పి ఆమెను బయటకు పిలిచాడు. అనంతరం మరో వ్యక్తితో కలిసి నిషారాణిపై కాల్పులు జరిపినట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

**మూడు నెలల క్రితమే హత్యాయత్నం విఫలం**

పోలీసుల వివరాల ప్రకారం అరుణ్కుమార్కు మొదటి భార్య ద్వారా ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనంతరం మొదటి భార్యకు విడాకులు ఇచ్చి ఆమె సోదరినే ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే రెండో భార్యకు ఇతరులతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఆమెను హత్య చేయాలని ముందుగానే





ప్రణాళిక రూపొందించిన అరుణ్, ఈ ఏడాది మార్చిలో అక్రమంగా దేశవాళీ తుపాకీ, బుల్లెట్లు సమకూర్చుకున్నాడు. తుపాకీ వినియోగంపై ప్రాక్టీస్ కూడా చేసినట్లు తెలుస్తోంది. అయితే చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ఆయుధాన్ని స్వాధీనం చేసుకోవడంతో అప్పట్లో హత్యాయత్నం విఫలమైంది. ఆయుధ చట్టం కింద కేసు నమోదై జైలుకు వెళ్లిన అరుణ్ అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చాడు.

**పరారీలో నిందితులు.. ప్రత్యేక బృందాలతో గాలింపు..**

బెయిల్ విడుదలైన తర్వాత కూడా తన నిర్ణయాన్ని మార్చుకోని అరుణ్కుమార్, పాతబస్తీ ప్రాంతానికి చెందిన స్నేహితుల ద్వారా మరో తుపాకీ సమకూర్చుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున నిషారాణిపై మూడు రౌండ్లలో కాల్పులు జరిపిన అనంతరం అరుణ్కుమార్, అతనికి సహకరించిన మరో వ్యక్తి అక్కడి నుంచి



పరారయ్యారు. కాల్పుల శబ్దం విన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు మల్కాజిగిరి పోలీసులు వెల్లడించారు.

# గృహ కార్మికుల నియామకంపై జాగ్రత్తలు పాటించాలి

**మేడ్చల్ సీఐ సత్యనారాయణ**

మేడ్చల్, జూన్ 10( మనం జిల్లా ప్రతినిధి): గృహ కార్మికులను నియమించుకునే విషయంలో నివాసితులు జాగ్రత్తలు పాటించాలని, గృహ కార్మికులందరి పోలీసు ధ్రువీకరణ (వెరిఫికేషన్) ప్రక్రియలను తప్పనిసరిగా అనుసరించటకు పోలీసులు సూచనలను జారీ చేశారని మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

హైదరాబాద్ కమిషనరేట్ పోలీసుల దృష్టికి వచ్చిన సమాచారం ప్రకారం, కొందరు నేరస్తులు, ముఖ్యంగా గృహ కార్మికులు, సంరక్షకులు (కేర్‌టేకర్లు) ఇంటి పనివారిగా పనిచేస్తున్న నేపాలీ వ్యక్తులు, ఇంటి యజమానుల నమ్మకం సానుభూతిని సంపాదించి ఇళ్లలో ప్రవేశం పొందుతూ, అనంతరం దొంగలు ఇతర ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు.ఇటీవల ఇటువంటి మూడు కేసులు, అందులో ఒకటి లాభం కోసం చేసిన హత్య (మర్డర్ ఫర్ గెయిన్) కేసు సహా, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసెస్ నమోదు చేయబడ్డాయని తెలిపారు.ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని, నివాసితులు గృహ కార్మికులను నియమించుకునే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైనంతవరకు నేపాలీ గృహ కార్మికులను నియమించకుండా ఉండాలని, అలాగే అన్ని గృహ కార్మికుల విషయంలో పోలీసు




ధ్రువీకరణ విధానాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

**సాధారణంగా అనుసరించే నేర పద్ధతులు:**

అనధికారిక లేదా ధ్రువీకరించలేని సిఫార్సుల ద్వారా ఉద్యోగం పొందడం, కుటుంబ సభ్యుల విశ్వాసాన్ని త్వరగా సంపాదించడం. ఇంట్లోని విలువైన వస్తువులు, కుటుంబ దినచర్యలు భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు.ఇంటి యజమానులు లేని సమయంలో దొంగతనకు పాల్పడి పారిపోతారని పేర్కొన్నారు.

**నివారణ చర్యలు:**

సాధ్యమైనంతవరకు నేపాలీ గృహ కార్మికులను నియమించకుండా ఉండాలని,. ఒకవేళ నియమించినట్లయితే, వారి నాగరికత/గుర్తింపు వివరాలను పూర్తిగా పొంది ఉండాలని చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రం, ఫోటోలు, మొబైల్ నంబర్ శాశ్వత చిరునామాను ధ్రువీకరించబడి ఉండాలని తెలిపారు.

గృహ కార్మికుల వివరాలను రికార్డు నిర్వహణ కోసం మేడ్చల్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సాధ్యమైన చోట్ల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని విలువైన వస్తువులు, లాకర్లు సున్నితమైన ప్రాంతాలకు వారి ప్రవేశాన్ని పరిమితం . చేయాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా సమాచారం తెలిసిన వెంటనే క్రింది నంబర్లకు సమాచారం అందించాలని

మేడ్చల్ పోలీస్ స్టేషన్, హైదరాబాద్
8712663280, 8712663281, 8712663289 మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.



# దివ్యాంగుల హక్కుల చట్టం అమలుకు పార్లమెంట్లో గళం వినిపిస్తా

**ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి**

సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ( ఆర్ పి డబ్ల్యూ డి యాక్ట్ ) అమలులో ఉన్న లోపాలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లి, చట్టం పూర్తి స్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. దివ్యాంగుల విశ్వవిద్యాలయాల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ గచ్చిబౌలిలోని ఎంపీ నివాసంలో కలిసి దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా 2016 దివ్యాంగుల హక్కుల చట్టంలో పొందుపరిచిన కీలక అంశాలు, వాటి అమలులో ఉన్న లోపాలు, దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన చర్యలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఎంపీకి అందజేశారు. పుస్తకంలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన కిరణ్ కుమార్ రెడ్డి, చట్టం అమల్లోకి వచ్చి దాదాపు పదేళ్లు పూర్తవుతున్నప్పటికీ అనేక నిబంధనలు సమర్థవంతంగా అమలు కాకపోవడం వల్ల దివ్యాంగులు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలను పార్లమెంట్లో ప్రస్తావించి, దివ్యాంగుల హక్కుల పరిరక్షణతో పాటు చట్టం సమగ్ర అమలుకు అవసరమైన చర్యల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ డీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్ గౌడ్తో పాటు పలువురు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లోని ప్లాట్ ఫాం నంబర్-1 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం, మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో ప్లాట్ఫాం నంబర్-1లోని గేట్ నంబర్-4 బుకింగ్ కార్యాలయం ఎదురుగా ఉన్న వెయిటింగ్ హాల్లో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా భావిస్తున్నారు. ప్రాథమిక విచారణలో అనారోగ్య కారణాలతో లేదా ఇతర సహజ కారణాల వల్ల మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. అతడు బూడిద (గ్రే) రంగు చొక్కా, నలుపు (బ్లాక్) రంగు ప్యాంటు ధరించి ఉండగా, బెల్ట్ కూడా ఉంది. కడుపుపై పుట్టుమచ్చ (మోల్) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ను 9440083160 లేదా 8712658581 నంబర్లలో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లలో ఉండని యజమానులకు నోటీసులు

### హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి పీవీ గౌతమ్







మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి ): డబుల్ బెడ్ రూం ఇండ్లలో లేని వారికి నోటీసులు ఇవ్వాలని, నిర్మాణపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి.గౌతం ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి హౌసింగ్ కార్పొరేషన్ ఎండి పీవీ గౌతమ్ డబుల్ బెడ్ రూం కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. మంచి లే అవుట్లు, అన్నిరకాల మౌలిక వసతులతో నిర్మించి మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో లబ్ధిదారులు అందరూ నివసించేలా చూడాలని, ఇండ్లు కేటాయించినా ఈ కాలనీల్లోకి షిఫ్టు కాని వారందరికీ మరోసారి నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి వి.పి.గౌతం అధికారులను ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె కాలనీల్లోని పనులన్నిటినీ త్వరతగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ లోని 2 బిహెచ్ కె కాలనీల్లో పర్యటిస్తూ ఆయా కాలనీల్లో నివసిస్తున్న వారితో మాట్లాడారు.

దుండిగల్ ఫేజ్ -1 , డబుల్ బెడ్ రూం కాలనీలో పర్యటించి అక్కడి మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ఇండ్లను కేటాయించిన లబ్ధిదారుల్లో ఇంకా చాలా మంది ఇక్కడ నివాసం ఉండని విషయాన్ని తెలుసుకుని, వారందరూ ఇక్కడికి తరలివచ్చేలా చొరవ చూపాలని, ఇక్కడ నివసించకపోతే ఇంటి రద్దు చేస్తామని మరోసారి నోటీసులు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగు పడాలని, వారికి సమాజంలో గౌరవం పెరిగేలా సొంత ఇంటి వసతిని కల్పించే లక్ష్యంతో చేపడుతున్న గృహ నిర్మాణ పథకాలని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన స్థానికులకు వివరించారు. తమకు ఇండ్లు కావాలని వేల మంది ప్రజలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినా ఉండటానికి ముందుకు రానివారికి కేటాయింపులను రద్దు చేసి అర్హులైన ఇతరులకు ప్రయోజనం కలిగిస్తామని స్పష్టం చేశారు. అట్లాగే దుండిగల్ ఫేజ్-2 కాలనీల్లోని పనుల పురోగతిని పరిశీలించి, త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మౌలిక వసతుల పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

2బిహెచ్ కె కాలనీల్లోని ఇండ్లను, సమీపంలోని 5 కిలోమీటర్ల పరిధిలో నివసించే వారికే కేటాయించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నదని ఈ మేరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నదని ఎండి గౌతం తెలిపారు. స్థానికంగా గండిమైసమ్మ ప్రాంతంలో ఇందుకు సంబంధించి జరుగుతున్న సర్వే ప్రక్రియను అధికారులు పరిశీలించారు.

ప్రజా పాలన సందర్భంగా తమకు ఇల్లు కావాలంటూ దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంటి స్థలం- సొంత ఇల్లు లేని (ఎల్-2) జాబితాలో ఉన్న వారికి 2 బిహెచ్ కె ఇండ్లను కేటాయించేందుకు వీలుగా, ప్రభుత్వ తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని గుర్తించేందుకు తహశీల్దార్లు ఇతర అధికారుల ద్వారా కొద్దిరోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. గండిమైసమ్మ ప్రాంతంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను అధికార బృందం పర్యవేక్షించింది. సర్వే వివరాలను సమగ్రంగా, యాప్ లో అప్ లోడ్ చేస్తున్నారా లేదా, అర్హతల నిర్ధారణ ప్రక్రియ తదితర అంశాలను గమనించి, సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే అనంతరం, యుద్ధప్రాతిపదికన ముందుగా 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారుల ఎపికను చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరికి, ప్రత్యేక కార్యదర్శి సూచించారు.

ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్యకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి.రమణారెడ్డి, జిల్లా హౌసింగ్ పిడి రమణమూర్తి, ఇంజనీర్లు పి.వి.రవీందర్ తోపాటు, స్థానిక రెవెన్యూ, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత, కమిషనర్ మధ్య వాగ్వాదం

### బండ మాదారం వార్డు సభలో కొంతసేపు ఉద్రిక్తత ప్రజా సమస్యలు వినే అంత ఓపిక లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించిన కాంగ్రెస్ నేత ఎర్రోళ్ల కృష్ణ ప్రజా సమస్యలను వినకపోతే వార్డు సభలు నిర్వహించడం ఎందుకు అంటూ నిలదీసిన కాంగ్రెస్ నేత




మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని బండ మాదారంలో జరిగిన వాటి సమావేశంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి కాంగ్రెస్ నేత ఎర్రోళ్ల కృష్ణ మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్ పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన బండ మాదారంలో వార్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత ఎర్రోళ్ల కృష్ణ ప్రజల సమస్యలను వార్డు దృష్టికి తీసుకొస్తుండగా కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి అడ్డుకోవడంతో వీరిద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామ సమస్యలను వార్డు సభ దృష్టికి తీసుకొస్తుంటే విన్నంత ఓపిక లేకపోతే ఎలా అంటూ కాంగ్రెస్ నేత ఎర్రోళ్ల కృష్ణ ప్రశ్నించారు. సమస్యలు వినే ఓపిక లేనప్పుడు వార్డు సభలను నిర్వహించడం ఎందుకు అంటూ ప్రశ్నించారు. ప్రజా సమస్యలు విననప్పుడు వార్డు సభ నిర్వహించడం సమయం వృధా తప్ప ఏం లేదని కాంగ్రెస్ నేత ఎర్రోళ్ల కృష్ణ పేర్కొన్నారు.

**నూతనకల్ గ్రామంలో...**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నూతనకల్,వార్డులలో వార్డ్ సభను నిర్వహించారు.ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లావుడియా శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు . ఈ సమావేశంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు సంబంధించిన అనేక అంశాలను ప్రజలకు వివరించారు. రాబోయ్యే వర్షాకాలం వర్షాకాల సన్నద్ధత, ప్రజలు డెంగ్యూ మలేరియా బరిన పడకుండా పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, తడి-పొడి చెత్త సేకరణ గురించి ప్రజలకు అవగాహన, సూచనలు చేయడం జరిగినది. ఈ వర్షాకాలములో ప్రతి ఒక్కరు మొక్కలు నాటావాలేనని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ యొక్క కార్యక్రములో వివిధ శాఖల అధికారులు వారి యొక్క ప్రగతి ప్రణాళికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ లావుడియా శ్రీదేవి, కమిషనర్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ సద్ది సురేష్ రెడ్డి, నాతి వేణుగోపాల్ గౌడ్, కౌన్సిలర్ హేమలత, అధికారులు ఉమాదేవి, రవీందర్ రెడ్డి, అపర్ణ, రవీందర్ రెడ్డి, విజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.






# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో లారీ టైర్ కింద పడి కూలీకి తీవ్ర గాయాలు

సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో పార్క్ చేసి ఉన్న లారీ కింద నిద్రిస్తున్న ఓ కూలీపై లారీ వెనుక టైర్ ఎక్కిపోవడంతో అతడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిలకలగూడ ఇన్స్పెక్టర్ రామకృష్ణ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్లోని నెల్లూరు జిల్లా సారా సెంటర్కు చెందిన టి. జయ ప్రకాష్ రెడ్డి (27) ఉపాధి కోసం మూడు నెలల క్రితం సికింద్రాబాద్కు వచ్చాడు. రైల్వే స్టేషన్ వద్ద వాటర్ బాటిళ్ల అన్లోడింగ్ పనులు చేస్తూ, పని ముగిసిన తర్వాత స్టేషన్ పరిసరాల్లోనే నిద్రించేవాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి పని ముగించుకున్న అనంతరం మద్యం మత్తులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని పిల్లర్ నెం. 990 వద్ద, అల్ఫాతా కేఫ్ ఎదురుగా రైల్వే క్వార్టర్స్ దగ్గర పార్క్ చేసి ఉన్న లారీ కింద నిద్రించాడు. అదే రాత్రి సుమారు 11 గంటల సమయంలో లారీ కదలడంతో వెనుక టైర్ అతని రెండు కాళ్లపై నుంచి వెళ్లింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన జయ ప్రకాష్ రెడ్డిని అతని స్నేహితులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు రెండు కాళ్ల కండరాలకు తీవ్ర గాయాలు అయినట్లు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవ్ చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# కార్మికులకు ప్రతినెల 1న తేదీనే వేతనాలు చెల్లించాలి

### ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్



మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి ): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల 1న జీతాలు చెల్లించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ స్వాగతించారు. ఇదే విధానాన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకూ వర్తింపజేసి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వేతనం ఎప్పుడు వస్తుందో తెలియని ఆశా వర్కర్ల జీవితం అగమ్య గోచరంగా తయారైందని,

ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకలా పనిచేస్తున్న ఆశా వర్కర్లు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని చంద్రశేఖర్ తెలిపారు. అయితే వారు చేసిన పనికి సంబంధించిన ప్రోత్సాహకాలు, వేతనాలు నెలల తరబడి ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనం ఏ తేదీన వస్తుందో స్పష్టత లేక చాలామంది ఆశా వర్కర్లు తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పిల్లల చదువులు, ఇంటి అద్దె, కుటుంబ ఖర్చుల నిర్వహణ భారంగా మారుతోందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించిన ఆశా వర్కర్లకు కనీస ఆర్థిక భద్రత కూడా లేకపోవడం బాధాకరమన్నారు.

**అంగన్వాడీ కార్మికులపై పెరుగుతున్న భారం**

అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య అందించడంతో పాటు గర్భిణులు, బాలింతల సంక్షేమ బాధ్యతలను నిర్వర్తిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు కూడా వేతనాల జాప్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో వేతనాలు ఆలస్యమవడం కుటుంబాలపై అదనపు భారం మోపుతోందన్నారు. ఇంటి ఖర్చులు, పిల్లల విద్య, వైద్య అవసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్న అంగన్వాడీ సిబ్బందికి గౌరవప్రదమైన వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని కోరారు.

**సొంత డబ్బుతో భోజనం పెట్టి బిల్లుల కోసం ఎదురుచూపులు**

పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని జె.చంద్రశేఖర్ అన్నారు. సరుకుల కొనుగోలు, వంట గ్యాస్, ఇతర అవసరాల కోసం చాలాసార్లు సొంత డబ్బులు ఖర్చు చేస్తూ భోజనం సిద్ధం చేస్తున్నారని తెలిపారు.

అయితే బిల్లులు, వేతనాలు నెలల తరబడి పెండింగ్లో ఉండటంతో అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కష్టపడుతున్న కార్మికులు తమ కుటుంబాల అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వారి సేవలను గుర్తించి కనీస వేతనం అమలు చేయడంతో పాటు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

**శ్రమకు గౌరవం దక్కాలి**

ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, అదే న్యాయం ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకూ జరగాలని చంద్రశేఖర్ అన్నారు. సమాజానికి అత్యంత అవసరమైన సేవలు అందిస్తున్న ఈ మూడు వర్గాల కార్మికుల శ్రమను గుర్తించి ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మెడికవర్లో న్యూరో ఎండోస్కోపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

### ఇక ఒకే వేదికపై అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ న్యూరో చికిత్సలు..

సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) న్యూరోసర్జరీ రంగంలో అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్లోని సంగీత్ యూనిట్లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ న్యూరో ఎండోస్కోపీ' ని ప్రారంభించింది. ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ డీఆర్డీవో ఛైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో మెదడు కణితులు, స్కల్ బేస్ వ్యాధులు, హైడ్రోసెఫాలస్, వెంట్రిక్యులర్ పాథాలజీస్ వంటి క్లిష్ట న్యూరోలాజికల్ సమస్యలకు అత్యాధునిక న్యూరో ఎండోస్కోపిక్ చికిత్సలు అందించనున్నారు. హై-డెఫినిషన్ న్యూరో ఎండోస్కోపిక్ పరికరాలు, నిపుణులైన న్యూరోసైన్సెస్ వైద్యుల బృందం సహకారంతో ఈ కేంద్రం సేవలు అందించనుంది. సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ రమేష్ శిగకోళ్లి ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేయనుంది. న్యూరో ఎండోస్కోపీ ద్వారా పెద్ద కోతలు లేకుండానే మెదడు మరియు స్కల్ బేస్ ప్రాంతాల్లో శస్త్రచికిత్సలు నిర్వహించడం సాధ్యమవుతుందని, దీనివల్ల రోగులకు నొప్పి, గాయాలు తగ్గడంతో పాటు త్వరితగతిన కోలుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ శిగకోళ్లి మాట్లాడుతూ, న్యూరో ఎండోస్కోపీ వల్ల క్లిష్టమైన మెదడు వ్యాధుల చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. అధునాతన విజువలైజేషన్ సాంకేతికతతో మెదడులోని లోతైన భాగాలను సైతం సురక్షితంగా చేరుకోవడం సాధ్యమవుతోందని వివరించారు. ముఖ్య అతిథి డాక్టర్ జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ఇమేజింగ్, నావిగేషన్, ఆప్టిక్స్, ప్రెసిషన్ టెక్నాలజీలలో వచ్చిన పురోగతి వైద్యరంగాన్ని కొత్త దిశగా తీసుకెళ్తోందన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతలను ప్రజలకు చేరవేయడంలో మెడికవర్ హాస్పిటల్స్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం మెదడు కణితులు, పిట్యూటరీ ట్యూమర్లు, హైడ్రోసెఫాలస్ వంటి వ్యాధులు ప్రారంభ దశలోనే గుర్తించే సౌకర్యాలు పెరగడంతో మినిమల్ ఇన్వేసివ్ న్యూరో ఎండోస్కోపిక్ చికిత్సలకు ప్రాధాన్యం పెరుగుతోందని వైద్య నిపుణులు తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభంతో న్యూరోసైన్సెస్ రంగంలో మెడికవర్ హాస్పిటల్స్ తన సేవలను మరింత విస్తరించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ వికాస్ అగర్వాల్, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్టులు డాక్టర్ శ్రీనివాస్ రావు దూసా, డాక్టర్ సుధీర్ పెంచాల పుట్టిబోయిన, కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ రోహిత్ రమేష్ వడిభాయే, సెంటర్ హెడ్ కృష్ణవేణితో పాటు పలువురు వైద్య నిపుణులు, అధికారులు పాల్గొన్నారు.





# ధరల పెరుగుదలపై సీపీఐ భారీ ధర్నా

### ప్రజలపై భారాలు తగ్గించాలంటూ కలెక్టరేట్ ముట్టడి

- నిత్యావసర వస్తువులు, ఇంధన ధరల పెరుగుదలపై సీపీఐ ఫైర్.
- ధరల నియంత్రణ, గ్యాస్ ధరల తగ్గింపు, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలని డిమాండ్.
- డీఆర్వోకు వినతిపత్రం సమర్పించిన సీపీఐ నాయకులు, ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక

కాప్రా సర్కిల్, జూన్ 10 (మనం న్యూస్): నిత్యావసర వస్తువులు, పెట్రోల్-డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ చార్జీల పెరుగుదలతో ప్రజల జీవనం భారంగా మారిందని ఆరోపిస్తూ సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం భారీ నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా డీఆర్వో మాలతికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వియస్. బోస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణలో విఫలమయ్యాయని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ ధరల నియంత్రణ, గ్యాస్ ధరల తగ్గింపు, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ధర్నాలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజనులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

## ఘట్కేసర్-బీబీనగర్ మధ్య రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) ఘట్కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 9వ తేదీ రాత్రి 10:55 గంటల సమయంలో



సికింద్రాబాద్ డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ నుంచి సమాచారాన్ని అందుకున్నారు. ఘట్కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. అదే సమయంలో కాజీపేట నుంచి చర్లపల్లి వైపు వెళ్తున్న కృష్ణ ఎక్స్ప్రెస్ లోకో పైలట్ పట్టాలపై మృతదేహాన్ని గమనించి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్లోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు, చిరునామా తదితర అంశాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బంధువులను గుర్తించిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎవరూ ముందుకు రాకపోతే జీహెచ్ఎంసీ అధికారులకు అప్పగించే ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మోదీ దీర్ఘాయుష్షు కోసం కీసరగుట్టలో ఈటల ప్రత్యేక పూజలు

**- ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా..**

**- కీసరగుట్ట రామలింగేశ్వర స్వామివారికి అభిషేకం..**

కీసర, జూన్ 10 (మనం న్యూస్): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధానిగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ బుధవారం కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, దేశ ప్రజలకు మరింత కాలం సేవలందించేలా దీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు.







# మేడ్చల్ గంగా గ్రాండ్యూర్ వెంచర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

**బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి**

మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ పట్టణములో ఉన్న గ్రాండ్యూర్ వెంచర్ను 'ప్రొహిబిటెడ్' జాబితాలో చేర్చడంతో అక్కడి ప్లాట్, ఇంటి యజమానులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి సమస్యలను తెలుసుకోవడానికి భారతీయ జనతా పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డివెంచర్ను ప్రత్యక్షంగా సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం మేడ్చల్





తహసీల్దార్ ని కలిసి ఈ సమస్యపై చర్చించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు నేడు అనిశ్చితిలో పడటం బాధాకరమని పేర్కొన్నారు.ప్రజల ఆస్తి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి వెనుకాడదని హెచ్చరించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యంగా బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది అని అన్నారు.. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ నాయకులు మేడ్చల్ డివిజన్



అధ్యక్షురాలు శైలజారినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్,ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, వంశీ విజయ్,ఉపాధ్యక్షులు మైసర్ రాజు,కార్యదర్శి విష్ణు మూర్తి గౌడ్, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా,సి చ్ శ్రీనివాస్ గౌడ్ సీనియర్ నాయకులు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బొజ్జ రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు బొజ్జ వంశీధర్ రెడ్డి,సి ఎచ్ శ్రీపాల్ రెడ్డి, మహేష్ గౌలికర్, ఎన్ శ్రీనివాస్ గౌడ్,నాగరాజు,ప్లాట్ యజమానులు శ్రీనివాస్, సంజయ్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు

# మేడిపల్లి పారిశుద్ధ్య పనులపై జెసికి వినతి

**- పీర్జాదిగూడ పరిధిలో పారిశుద్ధ్య పనుల మెరుగుదల, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంపై జోనల్ కమిషనర్కు వినతి పత్రం అందజేసిన ామాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**

(మనం న్యూస్ జూన్ -10): మేడిపల్లి:మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు కలిసి ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త (ఐ ఏ ఎస్), బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ఏ.శైలజ లకు వినతి పత్రం అందజేశారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజా పర్యటనలో భాగంగా పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతాపురం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని తెలిపారు.

## ప్రధానంగా లేవనెత్తిన అంశాలు:

**పారిశుద్ధ్య లోపాలు – దోమల బెడద:**

అంతర్గత కాలనీల్లో క్రమం తప్పకుండా రోడ్లు ఊడ్చకపోవడం, వీధుల మూలల్లో చెత్త పేరుకుపోవడం వల్ల వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.




**' రోడ్డు స్వీపింగ్ యంత్రాల ఏర్పాటు:**

ప్రధాన రహదారుల శుభ్రత కోసం ఆధునిక రోడ్ స్వీపింగ్ మెషిన్లను వినియోగిస్తే పారిశుద్ధ్య సిబ్బంది అంతర్గత కాలనీల పరిశుభ్రతపై మరింత సమయం కేటాయించే అవకాశం ఉంటుందని సూచించారు.

**పాత పారిశుద్ధ్య విధానం అమలు:**

గతంలో ప్రతి పారిశుద్ధ్య కార్మికుడికి నిర్దిష్ట ప్రాంత బాధ్యతలు అప్పగించిన విధానాన్ని తిరిగి అమలు చేసి జవాబుదారీతనాన్ని పెంచాలని కోరారు.

**పీర్జాదిగూడ గుట్టలో సీసీ రోడ్ల నిర్మాణం:**

పీర్జాదిగూడ గుట్ట పరిధిలోని ఇరుకైన గల్లీలలో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోవడం, గుంతలు ఏర్పడటం, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున తక్షణమే సర్వే నిర్వహించి సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, తమ హయాంలో అండర్గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, స్ట్రీట్ లైట్లు, మంచినీటి పైప్లైన్లు, నల్లా కనెక్షన్లు వంటి అనేక మౌలిక సదుపాయాలను ప్రజలకు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం పెండింగ్లో ఉన్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు, పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి ప్రజారోగ్యం, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జోనల్ కమిషనర్ను కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి,బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా,ఆకుల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళికతో మున్సిపాలిటీల రూపురేఖలు మారుతాయి

**- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక వార్డు సభల్లో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య**

**- వర్షాకాల సన్నద్ధత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి**

**- 12 నుండి 18వ వార్డుల సభలకు పోటెత్తిన జనం.. ప్రజా సమస్యలపై విస్తృత చర్చ**




చేవెళ్ల, జూన్ 10 (మనం న్యూస్): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంతో మున్సిపాలిటీల రూపురేఖలు మారనున్నాయని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 12, 13, 14, 15, 16, 17, 18వ వార్డుల్లో బుధవారం నిర్వహించిన వార్డు సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలలో వార్డుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. వార్డుల సమగ్ర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ఈ 99 రోజుల ప్రణాళిక ఒక సువర్ణ అవకాశమన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని, సురక్షిత తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. 'జల సంరక్షణ - మన సంరక్షణ' అనే నినాదంతో భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రానున్న వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి**
**మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి**

మాట్లాడుతూ.. పట్టణంలో ఘన వ్యర్థాల నిర్వహణ (చెత్త సేకరణ) ను మరింత బలోపేతం చేస్తామని, ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. వార్డుల్లోని అంతర్గత సమస్యల పరిష్కారానికి ప్రజలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్ (మాజీ సర్పంచ్) బండారి శైలజ ఆగిరెడ్డి, చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, అలాగే కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, మంగలి కళ్యాణి యాదగిరి, అత్తెల్లి మనిషా అనంతరెడ్డి, కృష్ణా నాయక్, దేవల్ గారి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు పడాల ప్రభాకర్, రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, ముఖ్య నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి, మల్లారి శ్రీకాంత్ రెడ్డి, కవాడి రాజవర్ధన్ రెడ్డి, పిసరి దామోదర్ రెడ్డి, వివిధ వార్డుల ప్రజలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# శంకర విద్యాలయ స్కూల్‌ను తక్షణమే కాలనీ నుంచి తొలగించాలి

**స్కూల్ పక్కన ఉన్న పార్కు లో పాము పుట్టతో విద్యార్థులకు ప్రమాదం: కాలనీ వాసులు**



సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) మల్లాపూర్ లోని శక్తి సాయి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన శంకర విద్యాలయ స్కూల్ ను తక్షణమే కాలనీ నుంచి తొలగించాలని శక్తి సాయి నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శక్తి సాయి నగర్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీ లో స్కూల్ ఏర్పాటు చేయొద్దని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారికి, మండల అధికారికి ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. స్కూల్ ని ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల కాలనీవాసులకు పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. స్కూల్ ను కాలనీ నుంచి తొలగించాలని నిరసన తెలుపుతున్న మా పై కేసులు పెడతామని స్కూల్ యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా స్కూల్ పక్కన పార్క్ లో పాము పుట్ట కూడా ఉందని దీని వల్ల పిల్లలకు ప్రాణ హాని కూడా కలగవచ్చు అని గుర్తు చేశారు.

**శంకర విద్యాలయానికి అన్ని అనుమతులు ఉన్నాయి: ప్రిన్సిపాల్ తులసి**

శక్తి సాయి నగర్లో ఉన్న శంకర విద్యాలయ స్కూల్కు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయని ఆ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ తులసి తెలిపారు. స్కూల్కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై స్పందించిన ఆమె, శక్తి సాయి నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులతో చర్చించి వారి అనుమతి తీసుకున్నామని చెప్పారు. కాలనీవాసులు కాకుండా సమీపంలోని సాయి విద్యానికేతన్ స్కూల్కు చెందిన కొందరు ఉపాధ్యాయులు మాత్రమే నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, నిరసనల్లో పాల్గొంటున్న వారికి నోటీసులు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శంకర విద్యాలయానికి అన్ని విభాగాల అనుమతులు ఉన్నప్పటికీ, ట్రాఫిక్ విభాగం నుంచి రావాల్సిన ఎన్ఓసీ మాత్రమే పెండింగ్లో ఉందన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ సుమతి ఇటీవల బాధ్యతలు స్వీకరించడంతో పలు ఫైళ్లు పెండింగ్లో ఉన్నాయని, త్వరలో ట్రాఫిక్ ఎన్ఓసీ కూడా పొందుతామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. స్కూల్ కార్యకలాపాలు అన్ని నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నాయని తులసి స్పష్టం చేశారు.

# బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి

## రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల కసరత్తు

**మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో 43 బ్లాక్ స్పాట్స్, 20 హాట్ స్పాట్స్ గుర్తింపు.**

**- ఐదు ప్రధాన ప్రమాదకర కూడళ్ల వద్ద డీసీపీ స్థాయి అధికారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు.**

**- 2026 జనవరి-మే మధ్య 1,466 ప్రమాదాలు, 143 మరణాలు నమోదు.**

**- ఎన్ హెచ్-65 (విజయవాడ హైవే) అత్యంత ప్రమాదకర రహదారిగా గుర్తింపు**



కమీషనరేట్, జూన్ 10 (మనం న్యూస్): రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రాణనష్టాలను నివారించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్ అలైవ్' 4వ విడత కార్యక్రమంలో భాగంగా మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రధాన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ మరియు ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించి, నివారణ చర్యలపై దృష్టి సారించారు. నేరెడ్మెట్లోని కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలు, ప్రమాదాల గణాంకాలు, భవిష్యత్ కార్యాచరణపై పోలీస్ కమిషనర్ మీడియాకు వివరించారు. కుంట్లూర్ టీ-జంక్షన్, ఉప్పల్ ఎక్స్ రోడ్స్, బోయిన్పల్లి జంక్షన్ తదితర ఐదు ప్రధాన ప్రమాదకర ప్రాంతాల్లో డీసీపీ స్థాయి అధికారులు ప్రత్యక్షంగా తనిఖీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. 2026 జనవరి నుంచి మే వరకు కమిషనరేట్ పరిధిలో 1,466 రోడ్డు ప్రమాదాలు నమోదవగా, 143 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదాల సంఖ్యలో తగ్గుదల నమోదవుతున్నప్పటికీ మరింత అప్రమత్తత అవసరమని సూచించారు. ముఖ్యంగా ఎన్ హెచ్-65 (విజయవాడ జాతీయ రహదారి) అత్యంత ప్రమాదకర మార్గంగా గుర్తించబడింది.




ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ వద్ద ఇంజనీరింగ్ లోపాల సవరణ, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, హైవే పెట్రోలింగ్ బలోపేతం, హెల్మెట్-సీట్బెల్ట్ నిబంధనల కఠిన అమలు వంటి చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారానే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు.





# చేవెళ్ల వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

**- మోదీ 12 ఏళ్ల విజయవంతమైన ప్రజాసేవపై హర్షం**
**- దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పూజలు నిర్వహించిన బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి**



చేవెళ్ల, జూన్ 10 (మనం న్యూస్): గౌరవ భారత దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రజల చేత వరుసగా ఎన్నికై, సుమారు 4,399 రోజులుగా దేశానికి అంకితభావంతో సేవ చేస్తున్న సందర్భంగా చేవెళ్లలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మోదీ గారు దేశ సేవలో విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న (12 సంవత్సరాల సేవ అభివృద్ధి విశ్వాసం) శుభ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం చేవెళ్లలోని ప్రసిద్ధ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. దేశాభివృద్ధి మరింత ముందుకు సాగాలని, ప్రజా సంక్షేమం నిరంతరం కొనసాగాలని, భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి అర్చనలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అత్తెల్లి అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, ఆయన చేస్తున్న నిరంతర అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవ ఇలాగే సాగాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. '12 సంవత్సరాల సేవ... అభివృద్ధి... విశ్వాసం' అనే నినాదంతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.





## రోడ్డు భద్రతే ప్రాణ రక్షణ.. 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం

**గమ్యస్థానానికి వేగంగా చేరుకోవడం కంటే సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ముఖ్యం..**

సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ, బాధ్యతాయుతమైన రహదారి వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్తంగా 'అరైవ్ అలైవ్' రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఐఏఎస్తో పాటు ఎంఎంసీ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గమ్యస్థానానికి వేగంగా చేరుకోవడం కంటే సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ముఖ్యమని పేర్కొన్నారు. రహదారి నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర చర్యలను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. అలాగే రక్షణాత్మక డ్రైవింగ్ పద్ధతులను అనుసరించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని వివరించారు. విద్యార్థులు, యువతలో రహదారి భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి, సురక్షిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## భారీ వర్షంతో నిలిచిన నీరు

**తలసాని ఆదేశాలతో వేగవంతమైన సహాయక చర్యలు..**





సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) నగరంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మోండా డివిజన్ పరిధిలోని సజన్ లాల్ స్ట్రీట్లో భారీగా వర్షపు నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంటనే స్పందించి జీహెచ్ఎంసీ అధికారులను అప్రమత్తం చేశారు. బోయిన్ పల్లి సర్కిల్ డీసీ డాకు నాయక్తో పాటు శానిటేషన్ అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే, తక్షణమే సహాయక చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ సిబ్బంది మ్యాన్హోల్స్కు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించి నిలిచిపోయిన నీటిని వేగంగా బయటకు పంపించారు. అదేవిధంగా రహదారులపై పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించే పనులను కూడా చేపట్టారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకిన నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు.


## ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే శ్రీగణేష్



సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) పారదర్శకంగా, పొరపాట్లు లేకుండా జరిగేలా కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని క్లాసిక్ గార్డెన్లో బీఎల్ఏలు, కాంగ్రెస్ కార్యకర్తల కోసం ఎస్ఐఆర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, ఎస్ఐఆర్ కంటోన్మెంట్ కోఆర్డినేటర్ కల్వ సుజాత, కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కైలాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన తేదీలు, దరఖాస్తు విధానం, సాంకేతిక అంశాలు, పాటించాల్సిన జాగ్రత్తలపై కార్యకర్తలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సమగ్ర అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా పర్యవేక్షించడం కార్యకర్తల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు, ఎన్నికల అధికారులు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరుగుతుందని అన్నారు. గతంలో కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలకు సంబంధించి తలెత్తిన వివాదాలను గుర్తు చేస్తూ, ఓట్ల అక్రమ తొలగింపులు లేదా అక్రమ చేర్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గొంతులో ఇరుక్కున్న చేప ముల్లును ఎండోస్కోపీతో తొలగించిన గాంధీ వైద్యులు





సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) నల్గొండ జిల్లాకు చెందిన 43 ఏళ్ల మహిళ గొంతులో ఐదు రోజుల క్రితం చేప ముల్లు ఇరుక్కుపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికంగా పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించడంతో ఆమె మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రిని ఆశ్రయించారు. గాంధీ ఆసుపత్రిలో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉమ నేతృత్వంలోని వైద్య బృందం రోగిని క్షుణ్ణంగా పరీక్షించింది. గొంతులో లోతుగా ఇరుక్కున్న పదునైన, వెడల్పాటి చేప ముల్లును గుర్తించిన వైద్యులు అత్యాధునిక ఎండోస్కోపీ విధానాన్ని ఉపయోగించి విజయవంతంగా తొలగించారు. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో శస్త్రచికిత్స అవసరం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ఎండోస్కోపీ ద్వారా సురక్షితంగా ముల్లును తొలగించడం విశేషంగా నిలిచింది. చికిత్స అనంతరం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. సమయానికి గాంధీ ఆసుపత్రికి రావడంతో సమస్యను విజయవంతంగా పరిష్కరించగలిగామని డాక్టర్ ఉమ తెలిపారు. ఈ విజయవంతమైన చికిత్సతో గాంధీ ఆసుపత్రి వైద్యుల నైపుణ్యం మరోసారి రుజువైందని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

## గాంధీ మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ విభాగాధిపతిగా

# డా. బి.వి. నాగమోహన్ రావు బాధ్యతల స్వీకారం

సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) గాంధీ మెడికల్ కళాశాల, సికింద్రాబాద్లో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతిగా డా. బి.వి. నాగమోహన్ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రభుత్వ వైద్య కళాశాల, నిజామాబాద్ నుంచి బదిలీపై గాంధీ మెడికల్ కళాశాలకు వచ్చారు. డా. నాగమోహన్ రావు 2016 సంవత్సరం నుంచి ప్రభుత్వ వైద్య కళాశాల, నిజామాబాద్లో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తూ బోధన, పరిశోధన, పరిపాలనా రంగాల్లో విశేష సేవలు అందించారు. తన పదవీకాలంలో విభాగ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు వైద్య విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంలో కీలక పాత్ర పోషించారు. గాంధీ మెడికల్ కళాశాలలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక వైద్య విద్య,



పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించేందుకు, విభాగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది డా. నాగమోహన్ రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.






# గ్రీన్ బిజినెస్ మోడల్స్‌పై అవగాహన

మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గ్రీన్ బిజినెస్ మోడల్స్ పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి విశ్వాస స్పందన లభించింది. జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని పర్యావరణ ఇంజనీర్ నోడల్ అధికారి బి. రాజేందర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్, ప్లాస్టిక్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇతర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.క్లీనర్ టెక్నాలజీస్, వ్యర్థాల నిర్వహణ,వ్యర్థాల తగ్గింపులో సాధించిన విజయాలు, పునరుత్పాదక ఇంధన వినియోగం వంటి అంశాలపై పవర్పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించబడ్డాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ వినియోగాన్ని తగ్గించే వ్యూహాలు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలు, గ్రీన్ మోడలింగ్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు నీటి నిర్వహణ మొక్కలు నాటే కార్యక్రమాలు స్థిరమైన వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే సర్క్యులర్ ఎకానమీ విధానాలపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయ ఉత్పత్తులు ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి ప్రకారం సూచించిన రంగు-కోడ్ చెత్త వేరు చేసే బిన్లను ప్రదర్శించే అవగాహన ప్రదర్శన స్టాల్ను కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనపనార (జూట్) సంచులను పంపిణీ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముమ్మరం

**బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ను ప్రశ్నించిన సిట్ అధికారులు**

**సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్**



మేడ్చల్, జూన్ 10 ( మనం జిల్లా ప్రతినిధి): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముమ్మరంగా సాగుతుంది. బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఫోన్ నెంబర్ ట్యాపింగ్ కు గురైందని గ్రహించిన సిట్ అధికారులు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ను విచారించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తోటకూర అజయ్ యాదవ్ ఫోన్ నెంబర్ ట్యాపింగ్ కు గురైనట్లు సెట్ అధికారులు గుర్తించారు. దీంతో విచారణకు హాజరు కావాలని తోటకూర అజయ్ యాదవ్ ను సెట్ అధికారులు పిలువగా ఫోన్ టాపింగ్ విచారణకు ప్రాధాన్యత సంతరించుకుంది. గత 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో తోటకూర అజయ్ యాదవ్ ఫోన్ టాపింగుకు గురైనట్లు సిట్ అధికారులు గుర్తించారు

ఆ సమయంలో తోటకూర అజయ్ యాదవ్ తండ్రి తోటకూర వజ్రేష్ యాదవ్ అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా పోటీ చేశారు. ఆ సమయంలో తోటకూర అజయ్ యాదవ్ తండ్రి తరఫున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అదే సమయంలో ఆయన ఫోన్ ట్యాపింగ్ కు గురైనట్లు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో ఆయనను విచారణకు హాజరు కావాలని కోరగా తోటకూర అజయ్ యాదవ్ సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.

# పార్ట్‌టైమ్ ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యం.. కేసు నమోదు..

**19 ఏళ్ల జి. వర్ష విధులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు.**

**ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.**

కుషాయిగూడ, జూన్ 10 (మనం న్యూస్) : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 19 ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, జి. వర్ష పారామెడికల్ డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసి, కాప్రాలోని స్కిన్ కేర్ హాస్పిటల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తోంది.

ఈ నెల 9న విధులకు వెళ్లిన ఆమె సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్గా రావడంతో ఆందోళన చెందిన తల్లి జి. రుక్మిణి బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుర్తుతెలియని వ్యక్తి

సికింద్రాబాద్, జూన్ 10 (మనం న్యూస్) ఘట్కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే అధికారుల సమాచారం ప్రకారం, సాయంత్రం 7.05 గంటల సమయంలో డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ నుంచి అందిన సమాచారంతో అధికారులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఘట్కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై ఘట్కేసర్ డిప్యూటీ ఎస్ఎస్ ద్వారా సంబంధిత రైల్వే పోలీసులకు సమాచారం అందించగా, సికింద్రాబాద్ రైల్వే పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్లోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు, బంధువుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. గుర్తింపు అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించనున్నారు. ఎవరూ ముందుకు రాని పక్షంలో నిబంధనల ప్రకారం జీహెచ్ఎంసీ అధికారులకు అప్పగించనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.